కానుగు చెట్టు

పానుగంటి లక్ష్మీనరసింహారావు పంతులుగారు

[1921 దుర్మతి సంవత్సరాదిసంచికనుండి]

నక్కదోసకాయ యూరుగాయ, గోంగూరపచ్చడి, చల్లి పెరుగు అంతే. అంత కంటె నక్కడ నేమి దొఱకును? అవే పంచభక్ష్య పరమాన్నములు. ఇట్లను దినము వేళపాళ యనిలేక కొర్నిపాటి సుబ్బరాజుగా రన్నప్రదాన మాచరించుచుండిరి. అన్నము తప్పయున్నను. విస్తరి బొడ్డు మేడియాకు విస్తరి. ఉప్పు తేలియున్న నీరు దిగుడు బావి నీరు. ఇప్పటి మాటయా? దాదాపుగా మూఁడేండ్ల క్రిందటిమాట. ముప్పది సంవత్సరము లిట్లు బ్రాహ్మణుఁ డన్నప్రదాన మొనర్చినాఁడు. మహానుభావుఁడు. నిర్గర్వుఁడు. నల్వురు మోయఁదగిన చొప్ప మోపును తానే పొలమునుండి తలపైఁ బెట్టుకొని తెచ్చి బఱ్ఱెలకు వేయును. వాని పాలు పాలికాపులచేఁ బితికింపక తానే పిదుకును. ఇంట నందఱ కాతని భార్యయే వంట చేయును. వంటలక్కలు కాని పిల్లబ్రాహ్మణులు కాని వారి కెన్నఁడును లేరు. ఉంచుకొనవలసిన యావశ్యకతయు వారికి లేదు. తమ ఇంటిపని నొకరిచేఁ జేయించుట వారు తప్పుగ భావించుచుండెడివారు. పనవారికృత్యములను బైవారిచేఁ గూలి పెట్టి చేయించిన యెడల నతిథి పూజాఫలము పరిపూర్ణముగఁ దమకు సిద్ధింపదేమో యని వారికి భయము. పాలుమాలిక లేక, యొడలు దాఁచుకొనక భూత సంతుష్టి చేయుటయే పుణ్యకార్యమని నమ్మి వారట్లు చేసిరి.

మగనికిఁ దనకుఁ దవ్వెడు బియ్యము కుత కుత లాడించుటకే ఈ కాలపుఁ గులాంగన కోపిక లేద. దొడ్డిలో దాసి పిడిగుమ్మములో సేవకుఁడు. ఇంటిలో వంటలక్క. ఇంత పైఁ బలగ మున్నఁగాని యాలుమగనికంటె నెక్కువలేని ఇద్దఱి కాపుర మీ దినములలోఁ గడచేరకుండ మున్నది. పంచపాళిలో వారవైచిన బట్ట లుతుకునిపాలు. పెరటిలోఁ బారవైచిన తప్పెల దాసిపాలు. వడమటింటిలోని పప్పు వేయి పామాను బావనక్కపాలు. అమ్మగారు పడుకటింటిలో వారంగజేబు నవల నదువుచు నావులింతలపాలు. అయ్యగా రణాదిల్లపై పంతకములతో నప్పులపాలు ఇంతే కదా ఇప్పటి సంసారముల సౌభాగ్యము! అతిథి పూజ లేదు సరే కదా—పతి విస్తరిలోఁ బచ్చడి మెతుకులయినఁ జేసిపెట్టిన దేది? వంట ప్రొయ్యియొద్దఁ గూరుచుండు నెడల మొగము మెఱుఁగు కఱఁగి పోవునప్పుడు మగని మొగాన నింక ముద్దులేకాని మఱియేమున్నది? ప్రణయిని మంజరీ ద్విపదలో మండ నమ్మనో లేదో తెలియదుగాని, నమ్మడికిన తఱువాత నుప్పువేయవలయునో—యుడుకక ముందు వేయవలయునో తెలియదు. ఉండలు బిళ్లలు గాయలు కాకుండ నత్తెసరువేయఁగల యమ్మగా రన్నపూర్ణాదేవిగారు. వంటయింటిలోని ప్రాణహానులతోను బజారులోని కారపుబూనలతోను గాపురము లెట్లో జరుగుచున్నవి. జరుగక మానునా? కాలచక్రము నెవ రడ్డగలరు? ఆయు వుండగా నెవరేమి చేయఁగలరు? మగల బ్రదుకులే ఇట్లు దిగజాఱునప్పుడు మఱఁదుల, బావల, యత్తల బ్రదుకు లడుగవలయునా?

కాని యాహా! ఏమి దుర్గమ్మ!! దూపాటి సీమనుండి వచ్చినవాఁ డొకఁడు. పల్లె మలనుండి వచ్చినవాఁ డొకఁడు. కోనసీమనుండి వచ్చినవాఁ డొకఁడు. పలనాటిసీమనుండి వచ్చినవాఁ డొకఁడు. ఇట్లందఱు యతిథులై రాగా, వారి కందఱకు బహు పరిశుభ్రముగా వండి, భర్త కుట్టి సిద్ధపఱచియుంచిన యాకులలో వడ్డించి, వారు సంతుష్టిగఁ భుజించిన తరువాతఁ దాను భుజించును. ఇట్లొక్కదినమా? ఒక్క మాసమా? ఒక్క సంవత్సరమా? ఆఁడుదాని పరిపూర్ణ సహాయము లేకుండ బ్రహ్మదేవుఁడైన నన్నప్రదాన మాచరింపలేఁడు. అన్నప్రదాన పుణ్యమంతయు నంగనదే!

ఇక నీ యతిథులకు సాయంకాలమున మూఁడుగంట లగుటతోడనే—అనపఁగాయ దినములలో తంపటవైచిన యనుప గుగ్గిళ్లు—లేఁతజొన్న కంకుల దినములలో నూచ బియ్యము—మొక్కజొన్న పొత్తుల కాలములో మొక్కజొన్న పొత్తులు—ఇట్లు ఏ యే కాలములో నేది వచ్చునో—యది యల్పాహారముగ వారి యెదుటఁబెట్టి తాను చేఁ గునన మంత గంటము చేతఁ బుచ్చుకొని, తాటియాకులపై భాగవతమో, హరివంశమో మరేదియో యా సుబ్బరాజుగారు వ్రాసికొనుచుండును. ఇట్లాతఁ డెన్ని గ్రంథములో వ్రాసినాఁడు. కవీశ్వరు లాతనికిఁ గమ్మలు గట్టినట్లుందురు. తిక్కన సోమయాజి యాఱడుగుల పొడవుగలవాఁడని—గ్రద్దముక్కు గలవాఁడని—నడుమ కట్టులోఁ జార కత్తి గలవాఁడని కాలిన మొక్క జీడివన్నె రంగువాఁడని యాతఁడా యతిథులతోఁ జెప్పుచుండును. చేతిలోనున్న యనుపవప్పు ముందుఁ గథలోనున్న కాలినమొక్కజీడి వన్నెక్కువ రుచింపకుండుటచేఁ గొలఁదిగా వా రా మాటలను గణింపకుండెడివారు. తిక్కన సోమయాజిగారిట్లుండెనని మీకెట్లు తెలిసినదని యాయన నెవ్వరు నడుగలేదు. అడిగిన యెడల గారణ మాయనకు మాత్ర మేమి తెలియును? ఇట్లాయనకుఁ దోఁచుటయే కారణము. పింగళి సూరన్నగారికి ముందు దంతములలో నొకటి పడుగని యొకటి పెట్టియని చెప్పును. ఆయనకు అలాగుననె గనఁబడుచుండగ నెవరు కాదనఁగలరు? ఒకనాఁడు తాను తన భార్యయుఁ బండుకొని యుండఁగాఁ దాను "దుర్గా! పోతరాజుగా రెట్లుండురని నీ యభిప్రాయ?"మని యామె నడిగెను. ఈ ప్రశ్న యామె కెందులకో బోధపడదు. "పొడుగుగాను, నన్నముగాను ఉందురని నే ననుకొందున"ని యామె బదులు చెప్పెను. భర్త యడిగిన నడుగునుగాక! భార్యకీ ప్రత్యుత్తర మెందులకో యంతకంటె బోధపడదు. "అలాగునఁ గాదు సుమీ పొట్టిగా నుండును తగు మాత్రమైన బొజ్జగలిగి యుండును" అని భర్త బదులు చెప్పెను. ఔనని, కాదని, భార్యా భర్త లిట్లొక్క నిముసము సంభాషించుకొన్నమీఁదట భర్త—"నే నన్నమాటయే నిజమగునెడల—నదిగో—గోడబల్ల మీఁదఁ బెట్టిన మద్దెల యున్నదే అది గణగణ మ్రోఁగును" అనవరి కేదైన నెలుక దానిని గదల్చెనో మరేమైన జరిగెనో తెలియదు కాని, మద్దెల గణగణ మ్రోఁగెను. అంత నాతఁడు మహానందముగ లేచి మద్దెలను క్రిందికి దింపి దానికి బూజ లొనర్చి పోతరాజుగారి మద్దెలయని దానికిఁ బేరిడి పోతరాజుగారి గజేంద్ర మోక్షాది గాథలలోని పద్యము లన్నియు కీర్తనములుగాఁ బాడుకొనుచు మద్దెల వాయించుకొనుచుండెను ఇది జరిగి యిరువదేండ్లు దాటినది. అల్పాహార కాలమున నీ కథ యతిథులకుఁ బ్రతిదినము జెప్పును. అట్లు కొంతసేపు చెప్పి—

క. "పలికెడిది భాగవతమఁట
పలికించెడివాఁడు రామభద్రుండఁట నే
బలికిన భవహరమగునఁట
పలికెద వేఱొండుగాథ పలుకఁగ నేలా?"

యను పద్యమును చదివి "ఆహా! మహానుభావుఁడు! ఎంత మృదులముగా—నెంత లలితముగా—నెంత మనోహరముగాఁ—జెప్పినాఁడో" యని కన్నుల నీరు బలబల రాల్చుచుండును. తినవలయునుఁ బదునేఁ బొంగులు గార్చుచున్న భక్తిప్రియులకుఁ బోతరాజుగారి కవిత్వ మప్పుడు కావలయునా?

ఇట్లు కొంతకాల మత్యుత్సాహముగా నా సంసారమునకు దినములు జరిగినవి. కాల మొక్కరీతిగఁ గడచునా? వర్షములు వెనుకఁ బట్టినవి పంటలు తగ్గిపోయినవి క్షామము తలచూపినది. అందువలన నతిథులు మఱింతవచ్చుచున్నారు. అందఱకు సంతుష్టిగఁ బెట్టుచునే యున్నాఁడు. అప్పులు చేసినాఁడు—పాటి పొలములమ్మినాఁడు ఇల్లమ్మినాఁడు. ఇంటిలో బాత్రసామగ్రి నమ్మినాఁడు కోటప్పకొండ మ్రొక్కుతో సంబంధించిన తన యెడమకాలి వెండి కడియ మమ్మినాఁడు. అమ్మగా మిగిలిన రెండు గేదెలుఁ గూడఁ జచ్చిపోయినవి ఇంటిలో నేమియు లేదు మట్టమధ్యాహ్నమగునప్పటికి కిద్దఱతిథులు వచ్చినారు ఇంటిలో వరపోలెడు గింజలు లేవు అప్పుడు భార్యయొద్ద కాతఁడు పోయి ఇప్పుడు వచ్చిన యతిథులను భుజింపఁజేయు టెట్లు?— అని యడిగెను పసుపురాచిన దారమును మెడను గట్టుకొని మంగళసూత్ర మిచ్చి "ఇది యమ్మి వారికిఁ గావలయు సామగ్రి తెండు అమ్మాయి చద్దియన్నము తినినది. మన మీ దినము భుజింపవలదు వారికి సాయంకాలము కాకుండ భోజనముపెట్టి పిల్లను దీసికొని రాత్రి యొటకైన బోవుద" మని భార్య పలికెను మంగళసూత్రమునకు రెండు వరాలు కాసులు వచ్చినవి. కొంత వ్యయపరచి యా యతిథులకు సంతుష్టిగా భోజనముపెట్టి శిష్టాన్నము కొంత సాయంకాలమునఁ గూఁతునకుఁబెట్టి తాము తినక, వా రా రాత్రి యెవ్వరితోడను జెప్పకుండ వెడలిపోవఁ బ్రయత్నించిరి. కాని, ఈ యూరమన్న యొక సంపన్నుఁడీ యంశమును గర్ణాకర్ణిగా విని యాయనయొద్ద కా రాత్రి వచ్చి "సుబ్బరాజుగారూ! మీకు దుర్దినములు వచ్చినవి. దరిద్రతకంటె దుస్థితి లేదు మిమ్ము నేను గనిపెట్టుదును. మీ రెక్కడికిని బోవల"దని చెప్పెను. "ఓ యబ్బ! దుష్టదినములు మాత్రము మమ్మేమి చేయఁగలవయ్యా? దరిద్రము పోతరాజుగారు పడలేదా? ఆయనకంటె నే మెక్కువవారమా? ధర్మబుద్ధిచే నొకరు నా కింత పెట్టఁగ నేను దినువాఁడను గాను. పోతరాజుగారిని రక్షించిన యొంటిమిట్ట కోదండ రామమూర్తి మమ్మెల రక్షింపకుండును?

అడవులుబట్టి పోవుదుము వాయనా! పోతరాజుగారు "అడవి రక్షలేని యబలుండు వర్ధిల్ల రక్షింతుండు మందిరమునఁ బచ్చు"నని చెప్పినారు మమ్మడ్డ పెట్టకుము. కాని నా దొక్క కోరిక యున్నది ఎవ్వరైన వతిథులు వచ్చువేడల నీవు వారిని చేతనగువంతవఱ కాదరించుచుండుము. అట్లు చేయువేడలఁ బోతరాజుగారు సంతసింతురు" అని చెప్పి యాతని పంపివైచి, ఇదివఱకుఁ దాను వ్రాసిన తాటాకు గ్రంథము లన్నియు పటుక మీఁదఁ బదిలముగా దాచి, తాను వ్రాసిన పోతరాజుగారి భాగవతమును దేవతార్చనవు బెట్టెతోఁ గూడ పంగవస్త్రమునఁజుట్టి తలపైఁ బెట్టుకొని, పోతరాజుగారి మద్దెం పీడునఁ గట్టుకొని, గంటము మొలలో బెట్టుకొని, కూఁతునెత్తుకొని, భార్యచేయి పట్టుకొని—

కం. శ్రీకంఠ చాపఖండన
పాకారి ప్రముఖ వినుత, భండన విలస
త్కాకుత్స్థ వంశ మండన
రాకేందు యశో విశాల రామనృపాలా.

యని పఠించుకొనుచు వెడలిపోయెను.

2

అది మహమ్మదీయుల రాజ్యము ఆయూరి పే రేదో తెలియదు. జోడుగుఱ్ఱం బండిమీఁద నబాబుగారు బయలుదేరి—'కాసు' తోఁటఁ జూచి తిరుగ వింటికిఁ బోవుచున్నారు. ఆ దారిలో నొక బ్రాహ్మణుడు నిలువఁబడియున్నాఁడు గుఱ్ఱపుబండి వచ్చుచున్నది. "ఓయబ్బా! ఆవవయ్యా బండి! ఒక్కటే పరుగా?" యని బండివాని కాతఁడు కేక వైచెను. బండియాఁపక యాతఁడు తోలుకొనిపోవుచుండగా నా బ్రాహ్మణుడు గుఱ్ఱపుఁ గళ్లెములను బట్టుకొని బండి నాఁపెను. గుఱ్ఱములు బెదరుచున్నవి కాని వానిని గదలనీకుండ నాతఁడు పట్టుకొనియున్నాఁడు ముందుఁ గొంతదూరము పోయిన తురుష్క సవారులు వెనుకకు దిరిగిరి. మరికొందఱు జనులు మూఁగిరి. నబాబుగారు బండి దిగినారు ఆయనయొద్ద కాతఁడువెళ్లి "మాయబ్బా! నీ వే పనయ్యా! ఈ చుట్టుపట్ల పొలాలకంతకును రాజవు?నరేకాని, నాకేమైన భత్యమేర్పాటు చేసి, తాటాకు గ్రంథాలు వ్రాయనరాదటయ్యా! నాకు జరుగుబాటుగను మండును నీకు ఖ్యాతిగాను మండును. సుఖముగా గూరుచుండి వ్రాయుదును నీ కచ్చేరీలోనికి వచ్చి రానీయరని నిన్నుఁ జూచుట కీడకు వచ్చినాను ఎవరేమి చెప్పుకొందురో వినవచ్చును. బండి నిమ్మళముగాఁ దోలించుకొనరాదయ్యా" యని నబాబుగారితో ననియెను బ్రదుకు దెరువు కొఱకుఁ బ్రభుని ప్రథమమున సందర్శించునప్పటి సంభాషణ మిట్లున్నది. పాపము! భటుత్వ మెఱుఁగునా? ప్రభుత్వ మెఱుఁగునా? మన్నన యెఱుఁగునా? మార్దవ మెఱుఁగునా? మర్యాద యెఱుఁగునా? మాట తీరెఱుఁగునా? అయ్యో! వట్టి జానపదుఁడు. రూపమున మోట. వస్త్రమున మోట. పలుకున మోట వట్టి నిష్కల్మషుఁడు. అమాయకుఁడు. మన మున నొకటి నోట నొకటి యున్నదా? శుద్ధ సత్యకాలపువాఁడు. ఋషి విగ్రహుఁడు. హరి హరీ! ఇప్పటి ఇంద్రజాల మహేంద్రజాల మహామహోపాధ్యాయులలోని వాఁడా? ఇప్పటి వారిలోఁ గొందఱు సత్యసంధులకుఁ దక్కఁ దఱచుగా నెవ్వరినిఁజూచినను నోసలు వెక్కిరింపు. నొరిగిలింపు. మొగమెదుట నమస్కారములు. వెనుకఁ దిరస్కారములు. వలుక తేనెపట్టు— పిడికిలి కోలిపట్టు. పెదవిని మందహాసము. హృదయమునఁ జంద్రహాసము' అతఁ డిట్టి వారిలోవాఁడా? తన కుపకారపుమాట యేదో యెఱుఁగఁడు ఎదుటివాని కుపకారపు మాట యేదో యెఱుఁగుడు. మనసులో నేది సత్యమని తోఁచునో యది పైకి రావలసినదే. ఆ వచ్చుటలో నొక సొంపు లేదు సంతన లేదు. నీటులేదు మాటలేదు. వట్టి కఱ్ఱపడి కంకరఱాతి పాకముతో రావలసినదే! అతఁ డనినమాటలు విని నబాబుగారు కొంత విభ్రాంతులై యూరకుండిరి నబాబుగారివంటి వానిని సుబ్బరాజుగారెట్లు చూడలేదో, సుబ్బరాజుగారివంటివానిని నబాబుగా రట్లు చూడలేదు "మాయబ్బ అదేమి మాపయ్యా!

'కారే రాజులు రాజ్యముల్ గలుగవే గర్వోన్నతిం బొందరే?
వారేరీ సిరి మూఁటకట్టుకొని పోవంజాలిరే భూమిపైఁ
బేరైనం గలదే శిబిప్రముఖులున్ బ్రీతి యశఃకాములై
యీరే కోర్కులు వారలన్ మఱచిరే! యిక్కాలమున్ భార్గవా'

యని పోతరాజుగారు సెలవిచ్చి రయ్యా! అడుగక యిఱువదియేండ్ల కడిగినానయ్యా! నీ పొలాలన్నియు నాకూఱకే యిచ్చినను నా కక్కఱలేదు ఏదో కొలువు చేయించుకొనవయ్యా! ఎందులకింత యోజన? నీవిచ్చు భత్యము నాకేమియు నక్కఱలేదు వింటివా? పూట కొక్క యతిథి కన్నముపెట్టి మిగిలిన గంజితో నా కూఁతురును రక్షించుకొందును నేను నా భార్యయు బస్తుండెదము కాదేని కాయయో కసరో తినుచుందుము. మా మాటకేమి?" అని బ్రాహ్మణుడు పలికెను. ఇంకను నబాబుగారు నిర్వ్యగ్రుడ్లవైచుకొని చూచుచుండగా "నీతో నాకేమి పోవయ్యా—రాజన్నప్పుడు పోతరాజుగారే రాజుగాని నీ వెక్కడి రాజవయ్యా" యని యాతఁడు పోఁబోవునరికి నబాబుగారు భటులకుఁ గనుసన్నచేసిరో యేమో కాని నల్వురు భటులు సుబ్బరాజుగారిని మన్నములోని కెముకలేకుండఁ గొట్టిరి. సుబ్బరాజుగారు రామ రామ యనుచు నా దెబ్బలన్నియు నే మాత్రము తిరుగుబాటును లేకుండ కన్నయినఁ జిట్లించుకొనకుండ సహించెను. మరియొక భటుఁ డింతలో వచ్చి యాయన బన్నిదమును ద్రెంపఁబోవగ నాతని నెత్తిపై తన గంటము మొదటితోఁ గొట్టెను. వాఁడు గిలగిలలాడుచుఁ గ్రిందఁబడిపోయెను అంత సుబ్బరాజుగారు కారాగృహమందుంపఁబడిరి నవాబుగారు తమ మహలునకుఁ బోయిరి.

3

స్ఫోటకపు వ్యాధుంచే విషూచి వ్యాధుంచే నా మహమ్మదీయ గ్రామమంతయు నిండియున్నది. జనులు కుప్పతిప్పలుగాఁ జచ్చుచున్నారు. బండ్లమీఁదవైచి శవములను దీసికొని పోవుచున్నారు. సుబ్బరాజుగారి కారాగృహమున కొక్క పలుబడి బారల దూరములో నొక కానుగ చెట్టున్నది. అది వీధిప్రక్క నున్నది దానిక్రిందనే, దుర్గమ్మ యామె కూఁతుతో నివసించుచున్నది తనకుఁ, దనభర్త కన్నము లేకపోయినను ఏ జీరుగడమో కల్లెపెండలమో తిని కాలక్షేపము చేయఁగలరు కాని, అయిదేండ్లపిల్ల యట్లు బ్రదుకు గలదా? ఆ పిల్లను సంరక్షించుట కామె యెచ్చటనైన దాస్యమున కొప్పుకొని చేయవలయును గదా? ఎక్కడెక్కడఁ దిరిగినను సదుపాయమగు నొకరి దొఱకలేదు. తుద కొక్క యింట నెలకొక్కవరా జీతమున కొప్పుకొని యా యింటను స్ఫోటకపు వ్యాధిచే బాధపడుచున్న యొక కాంత కుదయమునుండి సాయంకాలమువఱకు నుపచారము చేయుట కంగీకరించెను మానవేతనములోఁ దీర్చుకొను పద్ధతిమీఁద నొక్కమాడ ముందుగాఁ దీసికొని పిల్లదానికిఁ గావలయు సామగ్రికొని కుండలోఁ దెల్లవాఱకముందే రవంతవండి, కూఁతునకు బెట్టి దానిని దండ్రి గారాగృహము గుమ్మము వెలుపల విడిచి తాను సేవకుఁ బోవుచుండును. ఇట్లు పదునైదు దినములు గడవకుండ నామెపిల్లకు జ్వరము వచ్చెను పుచ్చుకొన్న మాడ కింకను రెండు దినముల సేవ బాకి యున్నది ఋణము తీర్చుకొనకుండ రాదనియు, నుచితముగ నెవ్వరి సొమ్మును దీసికొనఁగూడదనియు నా జ్వరము తోడనే పిల్లను గారాగృహాంగణమున విడిచి సేవకుఁబోయి యా బాకి తీర్చుకొని, యంతటినుండి సేవకు రాఁజాలనని చెప్పెను. పిల్లకు స్ఫోటకము వచ్చినది. రెండిఱాకు లడ్డుకట్టుకొని యా చెట్టుక్రిందనే దాని చాటునఁ బిల్లను బెట్టుకొని కంటికి మంటికొక్కధారగా నేడ్చుచుండును. తండ్రి కారాగృహమందు భీష్మవ్రతాజమును జదువుకొనుచుండును. ఇట్లుండుగా బైట చాటున గుడ్డలలోఁ బిల్లను బెట్టుకొని యొక్కనాఁ డుదయమున దుర్గమ్మ కారాగృహము నొద్దకువచ్చి పిల్లను తండ్రికి జూపి యేడ్చెను. ఉదయ మయిదు గంటలకే యా పిల్ల మరణించెను. మృతినొందిన తన కూఁతును రోదనము చేయుచున్న భార్యను గాంచి కన్నులనుండి జారిన ఇందునగింజలంతటి రెండు బాష్పముల నట్టె త్రోచివైచి—"ఓయమ్మా! ప్రపంచ మిట్టిదని యెవరెఱుఁగరు? తొందరపడకు. ఒంటిమిట్ట కోదండరాముఁ డిచ్చినాఁడు. ఆయనయే తీసికొన్నాఁడు. ఓయమ్మా! తన సొమ్ము తాను

ఆంధ్రప్రదేశ్ మైనింగ్ కార్పొరేషన్
లిమిటెడ్, హైదరాబాద్.

ఇనుప ముతక లోహము, బంకమట్టి, శ్రేష్ఠమైన
సున్నపురాళ్ళు, సున్నపురాళ్ళపొడి, డోలొమైట్,
పాలువంటి వంకరలు గల ముక్కలు.
క్వార్ట్జ్ శిలల నన్నయికి
ప్రఖ్యాతి పొందిన సంప.

ప్రైవేట్ సహకారంతో నడుపబడు
సిమెంట్ ఫ్యాక్టరి
మరియు
కాల్సియం పరిశ్రమ

ప్రాథమిక పనులు శరవేగంతో సాగుతున్నది.

ఎ. పి. ఎం. సి. వారి ఆధునిక
లేబొరేటరిలో సరసమైన రేట్లకు నీరు
మరియు లోహముల పరిశోధనలు జరుపబడును.

ఇతర వివరములు:
మేనేజింగ్ డైరెక్టరుకు వ్రాయండి.

దీసికొనఁడేమి? పోతరాజుగారి మాటయందు నాకున్నట్లే నీకుఁ బ్రమాణబుద్ధి యున్నది కావునఁ జెప్పెదను.

'మన్నిక నీరి కెల్ల బహుమాత్రము చోద్యము! దేహ పుష్టిమం
తన్నను మందు జూచెదరు నాశకమానెడువారి భంగి నీ
వన్నవారి కేడ్చెదరు నావన కొల్లక దాఁగవన్నవే?
యెన్నటఁబుట్టె నప్పటికి నేగుట నైజము ప్రాణికోటికిన్'

అందువలన నిప్పుడు నన యమ్మ వైకుంఠమున నున్నది. నే నెఱుఁగుదును. నాకు రాత్రియే తెలిపినది" అనెను. ఇంతలో "స్ఫోటకపు శవము నవటికిఁ దీసికొని రాఁగూడదు. ఛీఛీ" యని భటులామెను బెదరించిరి. ఆమె యేడ్చుచు, "నాయనలారా! పోవుదును. క్షమింపుఁ"డని భర్తవంక తిరిగి "ఎవ్వరికైన నొకటంక మిచ్చినఁగాని ఈ పిల్లకుఁ దరువాతి కర్మము జరుగదు. నాయొద్ద నేమియు లేదు. నేనే తీసికొనిపోయి నా చేతులతోనే ఈ పని చేయవలయునా?" యని గోలున నేడ్చుచుఁ దటాలునఁ బోయెను. ఆమె యేడ్పు చూచి భర్త గుండెలే కాదు—బ్రహ్మాండ గోళమంతయు గడగడ వడకినట్లయ్యెను. నిజమైన యాపద వచ్చినప్పుడు—అందులో మహాపతివ్రత కాపద వచ్చినప్పుడు—ఆ యాపద కన్నకడుపుతోఁ జేరినప్పుడు—నువాదుంతోఁ జెల్లగిల్లినట్లు ప్రకృతి కంపము నవఁగా నాశ్చర్య మేమి? అంత సుబ్బరాజుగారు—

"లావొక్కింతయు లేదు ధైర్యము విలోలంబయ్యెఁ బ్రాణంబులున్
ఠావుల్దప్పెను మూర్ఛ వచ్చె తనువున్ డస్సెన్ శ్రమం బయ్యెడిన్
నీవే తప్ప నితఃపరం బెఱుఁగ మన్నింపందగుం దీనునిన్
రావే ఈశ్వర! కావవే వరద! సంరక్షింపు భద్రాత్మకా!"

యను పద్యమును జదువుకొని కొంత శాంతపడి రామనామస్మరణ మొనర్చుకొనుచుండెను.

4

సుబ్బరాజుగారి గంటపు దెబ్బ తినిన భటుఁ డిరువది దినములు బాధపడి మరణించెను. ఖూనీ నేరము చేసినందులకు సుబ్బరాజుగారిని నవాబుగారింక శిక్షింపవలసియున్నది. విచారణ కొక్క దినమున నాయనను నవాబుగారి కచ్చేరికి దీసికొనిపోవుట కేర్పాటయినది. వకీళ్లు కావలయునా? దస్తావేజులు కావలయునా? సాక్ష్యము కావలయునా? నవాబుగారి యెదుటనే కదా నేరము జరిగినది? భీష్మైకాదశి దినమున విచారణ జరుగనై యున్నది ఆ యుదయముననే దేఁకుకొనుచు నాతనిభార్య కారాగృహమునొద్దకు వచ్చి భర్తను గాంచి "నా కీ యుదయమునుండి నాంతులు భేదు లగుచున్నవి నా తను వీసాయం కాలమునకు నిల్చునని తోఁపదు నడువలేక ఇట్లు దేఁకుకొనుచు వచ్చితిని. సర్వథా యనుగ్రహ ముంపవలయును." అని రోయేటఁబడిన గొంతుతోఁ బలికెను భార్యను గాంచి భర్త కొయ్యవారెను ఒక్క నిముసమునకుఁ బ్రజ్ఞఁగాంచి చూచునరికిఁ దన పాదముల నాయనశలాకలనుండి యావలకు లాఁగి వానిని గన్నులందుఁ జేర్చుకొని—శ్రీరామచంద్ర పరబ్రహ్మణేనమః—యని భార్య యనుచున్నది. భర్తకుఁ గంటివెంట నీటి చుక్క లేదు. భార్య కంతకంటె లేదు. అతితుచ్ఛమైన వస్తువునకయిన రసమున్నది అతి నీచమైన కార్యమునకైన రసమున్నది అభ్యుదయంబునకైన రసమున్నది కాని యతిదుఃఖమున రసము లేదు. "మీ పాద సన్నిధిని నాకు మరణింపవలయునని యున్నది కాని ఈ వ్యాధిగల నన్నిక్కడఁ గొంతసేపైన నుండనీయరు. భటులు పొమ్మనకుండనే స్వామీ వెడలిపోదును నమస్కారము" అని యామె దేఁకుకొనుచుఁ బోయెను. ఆమె యేమనుకొనుచుఁ బోయెనో యాయన యేమనుకొనుచుఁ గొట్టులోనుండెనో వారికే తెలియఁదగినది. అంత

కం. కలఁడందురు దీనులయెడఁ
గలఁడందురు పరమయోగి గణములపాలన్
గలఁడందు రన్ని దిశలను
గలఁడు కలండనెడివాఁడు కలఁడో లేఁడో

యని చదువుకొనుచు నిట్లు గలిగిన సందేహమును వెంటనే పరిహరించుకొని,

కం. నీపాద కమలసేవయు
నీ పాదార్చకులతోడి నెయ్యము నితాంత
శ్రీపాద కమల సేవయుఁ
దాపసమందార నాకు దయసేయఁగదే

యని ధ్యానించుకొనుచుండెను. ఇంతలో విచారణకొఱకు నాయనను గచ్చేరికిఁ దీసికొనిపోవు భటులు వచ్చిరి. నా నాయనను దీసికొని పోవుచుండఁగ "ఆ కామంగుచెట్టు క్రింద నన్నొక్కసారి నిలుపవయ్యా! నా భార్యను చూచివత్తు" నని వారిలో నొక్కని నాతఁ డుకోరెను. వా రంగీకరింపక చెట్టు ప్రక్కనుండియే యాతనిఁ దీసికొని పోవుచుండ "దుర్గా! దుర్గా! దుర్గా" యని సింహగర్జనముగఁ బిలిచెను. పలుకలేదు. ఆమె మరణించెనని నిశ్చయపఱచుకొని కోదండరామప్రభూ యని యొక్క కేకవైచి "ఓ కామంగుచెటూ? నా దుర్గను, నా బిడ్డను నేను పోషించుకొనలేని దినములలో నీవు నీడ నిచ్చి వారిని పోషించితివి దిక్కుమాలినదైన నా భార్య కళేబరము ప్రక్కనుండియే దానిని జూడకుండ నేను బోవుచున్నాను. నీవట్టి చెట్టువు కావు. నీవింక నామె యొద్దనే కనిపెట్టుకొని యున్నావు. నీవే నాకంటె ధన్యత కలదానవు. నీ కుత్తర జన్మమున మహాత్ముని నగు జన్మము సిద్ధించుగాక" యని పలుకుచునే చెట్టును దాటి కచ్చేరికిఁ బోయెను. కచ్చేరిలో విచారణ యేమున్నది? "నీవు మా భటుని గంటముతోఁ గొట్టి చంపితివి. నీకు మరణశిక్ష యేల విధింపగూడదో చెప్పుకొందువా" యని నవాబుగా రాయన నడిగిరి. "ఓయబ్బ! గంటపుదెబ్బకే చచ్చిపోవువాఁడయ్యా! గట్టిగాఁ గొట్టనే లేదయ్యా! నాయనా, ఎన్ని గ్రంథములు వ్రాసిన గంటమయ్యా! ముందు జన్మమున వాఁడు మంచి కవియై పుట్టును. తనను మంచి మేలు పొందుటకే యాతఁడుఁ బోయినాఁడని నమ్మవయ్యా! మఱి నన్నేదో చెప్పుమంట వెందుకు? నన్నడుగ నెందుకు? నీ యిష్టము వచ్చినట్లు చేసికోవయ్యా. అడిగి యడిగి నీవేమాత్రము చేయఁగలవయ్యా? ఛీ ఛీ" యని కచ్చేరినుండి పోవుటకుఁ బ్రయత్నించ భటులాయనను బట్టుకొనిరి. ఇంత గర్వి, ఇంత పొగరుబోతు, వింత దుర్మార్గుఁడు లేఁడని యచ్చటివారంద ఱనుకొనిరి. ప్రజల యభిప్రాయముల కిన్నవము, దౌర్భాగ్యము నిది. ఈ యంశమునందే కాదు. అన్ని యంశములందుఁ గూడ నిట్టిదే—అతని తల నఱుకవలయునని నవాబుగారు భటుల కాజ్ఞాపించెను. "ఓయబ్బ! ఇంతే కదా! ఈమాత్రానికి నన్నిడకుఁ బిలిపింప నెందుకయ్యా" యని యా బ్రాహ్మణుఁడు పలికెను. భటులాతని వధ్యస్థానమునకుఁ గొనిపోయిరి. తలారి కత్తి చేతఁ బట్టుకొని యాతని మొగముఁగాంచి గడగడ వడఁకి నే నీ పనిని చేయఁజాలనని కత్తి నావలఁ బాఱవైచెను. నీ వఱుకలేవని నవాబుగా రాతని నడుగ "అతని రూపము నాకేమో భయంకరముగా నున్నది. నా చేతులాడకున్న" వని యాతఁడు నవాబుగారి పాదములపైఁ బడెను "నీ వాతని నఱుకకుండునెడల నిన్ను ముందు వధింతు"నని నవాబుగా రాతనిని బెదరించిరి. అంత నాతఁడేమి చేయఁగలఁడు? గడగడ వడకుచు సుబ్బరాజుగారి కంఠమున బిస్మిల్లా యని కత్తి విసరెను. కంఠము తెగలేదు. మరియొకసారి చాలవ తెచ్చుకొని వైచెను. తెగలేదు "ఓయబ్బ! నీవలనఁగాదయ్యా. భాగవతము తలమీఁదనుండఁగా దల తెగునని యే యనుకొంటివటయ్యా! నీ బొందవడ! ఎక్కడనో యడవి మృగమువలె నున్నావు నిను. నీవేమియు గద్దపడకు. వెనుకకు విఱిచి కట్టిన నా చేతులు విప్పవయ్యా. భాగవతము తలమీఁదినుండి దింపుదును. తరువాత నరుకుపుగా సుఖముగా నఱుకుదువు కాని—ఎందుకింత యోడిన" అని సుబ్బరాజుగారు పలికిరి చేతులు విప్పుమని నవాబుగారు భటులకు నంజ్ఞ చేసిరి. అంత సుబ్బరాజుగారు కొర్నిపాటి ప్రయాణమునుండి యా నిమిసమువఱకుఁ దలమీఁదనే కట్టుకొనియుంచిన భాగవతమును దీసి, కన్నుల కద్దుకొని దూరముగనుంచి దానికి బ్రదక్షిణ మొనర్చి సాష్టాంగ నమస్కరించి లేచి "కోదండరామప్రభూ!" యని బ్రహ్మాండ కటాహ మదరున ట్లొక్క కేకవైచి నాసముట్టఁగఁ గ్రిందఁబడి ప్రాణములు విడిచెను. కత్తితో భటుఁడింక నఱుకుట యెందుకు? అతఁడెట్లు మరణించెనో? యని యందఱు కాశ్చర్యముగా నున్నది పరీక్షించి చూడఁగ నాతని నోటినుండి రక్త మొలికినది పిడుగుపడినట్లు కోదండరామప్రభూ యని యాతఁడు వైచిన కేకతో గొంతులోని రక్తనాళము తెగి యా రక్తపుఁ జుక్కలు నాయుద్వారమునఁ బోవుటచే నాఁటిరి యాడక నిముసములో మరణ మీతనికి సిద్ధించినదని యచటనున్న వైద్యుఁడు Scientific Explanation (శాస్త్రీయ సమాధానమును) చెప్పి, తన పాండిత్యమందఱకుఁ దెలిపినదో లేదో యని యటు నిటు చూచెను. పరమాత్మని యాజ్ఞ యయినది కావునఁ బ్రాణములు దేహమును వదలిపోయినవని చెప్పఁగ నందఱకును దెలిసినమాట.

సుబ్బరాజుగారు మరణించిరనుమాట వినినంతనే కన్నుల నీరైనఁ గనఁబడెనో కడుపులో నేమైన గుబులు పుట్టెనోకాని గడగడ వడఁకి బారున నవాబుగా రేడ్చిరి. వారి కంటె ముందుగాఁ గాజీలు వారి భటులేడ్చిరి. అప్పటి ప్రజ లందఱకంటె ముందుగాఁ గాకులు నేడ్చిరి అంద ఱేడ్చుచున్నారు. ఎందుల కేడ్చుచున్నారో యెవ్వరు నెఱుఁగరు? ఏది? ఆ సమయమున నెవ్వరికైన మతి యున్నదా? చైతన్యము ఉన్నదా? గోలున్న రోదనముతప్ప వంతకంటె నేమియు లేదు. అంతయుఁ దీఱిన తరువాత నేడ్చిన లాభ మేమి? సుబ్బరాజుగారి కథ విన్నవారికే కన్నులు చెమ్మగిల్లవలసి యుండగ నాయన కథను జూచిన వారికిఁ గడుపు చెఱువయ్యెననఁగ నాశ్చర్య మేమి? నవాబు గారేమో రామభక్తుఁడైనాఁడట. అగుఁగాక. రామభక్తు లెందఱులేరు. వారిలో నాతఁ డొకఁడు. నవ కోటి లింగాలలో నొక బోడిలింగము లెక్కయేమి? ఆర్యావర్తదేశమున నా రామచంద్రమూర్తి మాహాత్మ్యమెఱుఁగని నరుఁడెవ్వఁడు? నరునివఱ కెందులకు? కోతి నడుగు—కొండముచ్చు నడుగు—కాకి నడుగు—గ్రద్ద నడుగు. అంతవఱకుఁ గూడ నెందులకు? చెట్టు నడుగు—పుట్ట నడుగు—రాతి నడుగు—అప్పనడుగు—దేశమంతటను రామనామము తారకోటి … మాఱు మ్రోగుచున్నది. రాముఁడు లేనిచోటేది? రామునిగూర్చి యొకానొకఁ డిట్లు పలికినాఁడు.

సీ. నిధి పురాణంపు వేదికపైని నీవు, పారాయణపుఁ బీటపైని నీవు
దృశ్య ప్రబంధంపుఁ దెరల సందున నీవు, స్మృతివార్త శ్రుతిఁ బద్ధ యెడను నీవు,
గొల్లసుద్దుల కోలకు డొల్లలందున నీవు, యక్షగానపుఁ జిందులందు నీవు
చందాల బజనపై మొండితంబుర నీవు, తోలుబొమ్మల సంతగోల నీవు.

పదుకగదుల గోడల నీవు భక్తహృదయ
భవనమున నీవు యాయావరతను నీవు—
సృష్టి నీమయమో? నీవు సృష్టిమయమొ?
యెట్లుయనవేమి? రామ! రక్షింపుమయ్య!